మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# పకడ్బందీగా పైలెట్ ప్రాజెక్టు సర్వే కార్యక్రమం

### హన్వాడ మండలం మాదారంలో సర్వే తనిఖీ చేసిన కలెక్టర్.. సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలని సూచన



సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజేయంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 03 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు కార్యక్రమం సర్వే గురువారం ప్రారంభమైంది. కుటుంబ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం ఆమె జిల్లా మహబూబ్‌నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలం, మాదారం గ్రామంలో ప్రారంభించిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. సర్వే నిర్వహిస్తున్న టీమ్‌లతో, కుటుంబ సభ్యులతో కలెక్టర్ మాట్లాడి సూచనలు చేశారు. కుటుంబ డిజిటల్ కార్డు పైలెట్ సర్వేకు ప్రజలు అందుబాటులో ఉండి సర్వే బృందాలకు సహకరించి వివరాలు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. సర్వే బృందాలకు ఇచ్చిన డేటాను ఆయన పరిశీలించి డేటాలో ఉన్న అన్నికాలమ్స్‌ను నింపాలని, ముఖ్యంగా వయస్సు విషయంలో ఆధార్‌కార్డు ఆధారంగా ఇప్పటి వయసును రాయాలని బృందాలకు సూచించారు. కుటుంబ సభ్యులు కోరినప్పుడు మాత్రమే వేరువేరుగా వివరాలు నింపాలని సూచించారు. కాగా మాదారంలో 163 కుటుంబాలు ఉండగా, 2 సర్వే బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఒక బృందానికి డిటి, మరో బృందానికి ఎంపిడిఓలు నాయకత్వం వహిస్తున్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు..

- వన్ ఫ్యామిలీ వన్ కార్డుకు శ్రీకారం
- పైలట్ ప్రాజెక్టుగా మహబూబ్‌నగర్‌లోని 37వ వార్డు, సద్దలగుండు ప్రాంతం
- డిజిటల్ కార్డు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 03 ప్రభాతవార్త :** రాష్ట్రంలో అర్హులైన వారు ఎక్కడ ఉన్నా వారికి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించేందుకు తెలంగాణ ఫ్యామిలీ డిజిట్ కార్డుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం శ్రీకారం చుట్టినట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. వన్ ఫ్యామిలీ వన్ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సద్దలగుండు 37వ వార్డులో ఆయన ప్రారంభించి మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టుగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని సద్దలగుండును ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. ఈ రోజు నుంచి వచ్చే 5 రోజుల పాటుగా అధికారులు ఇంటింటికి వచ్చి ప్రజల సమాచారం సేకరించి పూర్తి – మిగతా4లో..

## సర్వేను పకడ్బందీగా నిర్వర్తించాలి...

- జిల్లాలో డిజిటల్ ఫ్యామిలీ కార్డ్ సర్వే ప్రారంభం
- డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేకు ప్రజలు సహకరించాలి...
- సర్వే నిర్వహణలో భాగంగా అధికారులు...
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందిగా నిర్వర్తించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటిలోని 7వ వార్డులోని ఊయ్యాలవాడలో గుడ్లనర్వ జ్యోతి ఇంటి దగ్గర కుటుంబ సభ్యుల వివరాలను గల నమోదు చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు, సిబ్బంది నుంచి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎలాంటి లోపాలు లేకుండా డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఉదయం 10 గంటల నుంచి సర్వే ప్రక్రియ మొదలు – మిగతా4లో..

## డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి..

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



సర్వే వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

**నారాయణపేట టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** తెలంగాణ డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ ఫ్యామిలీ కార్డుకోసం పైలెట్ ప్రాజెక్ట కింద నారాయణపేట జిల్లాలో ఎంపిక చేసిన మక్తల్ నియోజకవర్గంలోని కొత్తపల్లి గ్రామం, నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు, నారాయణపేట నియోజకవర్గంలోని దామరగిద్ద మండలం అయ్యవారిపల్లి గ్రామంలో గురువారం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ముందుగా ఉట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ ఇంటింటి సర్వేను ఎన్ని బృందాలతో చేపడుతున్నారని, సర్వే నమోదులలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆమె సర్వే బృంద సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ, అంగన్‌వాడి కార్యకర్తతో పాటు మరో ఇద్దరు సిబ్బందితో కలిపి మొత్తం 10 బృందాలు సర్వే చేస్తున్నట్లు ఉట్కూర్ ఎంపిడిఒ కలెక్టర్‌కు తెలిపారు. గ్రామంలో 172 కుటుంబాల ఆధారంగా సర్వే జరుగుతోందని, కొత్త కుటుంబాల వివరాలను ఆధార్ కార్డు ద్వారా నమోదు చేస్తున్నట్లు సర్వే బృందం కలెక్టర్‌కు వివరించారు. కుటుంబంలో పెద్ద వయసు కలిగిన మహిళ ఉంటే ఆమె పేరునే ప్రామాణికంగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొత్తపల్లి గ్రామానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి సూపర్‌వైజర్‌గా ఉన్నారని సర్వే ఫాంలలో ఆమె సంతకాలు ఉండేలా చూసుకోవాలని సర్వే సిబ్బందికి ఆమె చెప్పారు. తమ గ్రామానికి రోడ్డు వేయించాలని గ్రామస్తులు కొందరు కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించిన – మిగతా4లో..

### ఖరీఫ్ సీజన్ వరి దాన్యం కొనుగోలు కేంద్రాలు

# పకడ్బందీగా నిర్వహించాలి...

### వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**గద్వాల, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం సచివాలయం నుండి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారులతో కలిసి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు.

సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పక డ్బందీగా నిర్వహించాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరం మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యతతో సజావుగా కొనుగోలు జరిగే విధంగా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో దొడ్డ రకం వరి ధాన్యం, సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వేరువేరుగా ఏర్పాటు చేయాలని, అందుకు తగ్గ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వరి ధాన్యం ఎం.ఎస్.పి ధర ఏ గ్రేడ్ రకానికి 2320, సాధారణ రకానికి 2300 రూపాయలుగా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల అదనంగా అందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రైతుల దగ్గర నుంచి సేకరించిన ధాన్యం మిల్లలకు చేరే వరకు కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బందిని, వ్యవసాయ శాఖ అధికారులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక ప్రత్యేక నెంబర్ ను కేటాయించాలని ప్రతి బస్తాపై ఆ కొనుగోలు కేంద్రం నెంబర్లను ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం వరి ధాన్యం రాకుండా పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖకు సీఎం సూచించారు.




వీసీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తెలంగాణ డీఎస్సీ 2024 ఫలితాల మెరిట్ ఆధారంగా ఎంపికైన ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ ప్రక్రియను శనివారం వరకు పూర్తి చేయాలని అన్నారు. ఈనెల 9వ తేదీన ఉపాధ్యాయ నియామక పత్రాలను అందించేందుకు కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు

అనంతరం జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులతో మాట్లాడుతూ. జిల్లాలో ఖరీఫ్ వరి ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఐకెపి, పిఎసిఎస్ నిర్వాహకులు నిర్వహించాలని, సన్న రకం వరి ధాన్యం, దొడ్డు రకం వరి ధాన్యం సేకరణకు విడివిడిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, సన్న రకం వరి ధాన్యానికి అదనంగా 500 రూపాయలు ఇవ్వనున్నట్లు రైతులకు తెలియజేయాలన్నారు రైతులకు ఇబ్బంది కలుగకుండా గని బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని అన్నారు రైతుల నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు చేరేలా రవాణా సౌకర్యంను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాళ్లు, తరుగు పేరుతో రైతులని ఇబ్బందులు గురి చేయరాదని, కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని అని అన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మెరిట్ ఆధారంగా అర్హత సాధించి, ఎంపికైన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని శనివారం వరకు పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 9వ తేదీన ఎంపికైన ఉపాధ్యాయులకు హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలియజేశారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, పోరా సారఫరాల జిల్లా మేనేజర్ విమల,వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది..

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 03 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 88 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించి మాట్లాడుతూ, ఇది ప్రజా ప్రభుత్వం అని, ప్రజలకు అండగా నిలుస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు కృత నిశ్చయంతో ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఏ సంక్షేమ పథకాలు ఆపకుండా, కొనసాగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే...**

దేవినవరాత్రుల సందర్భంగా మహబూబ్‌నగర్ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ కామేశ్వరి సమేత ఐశ్వర్యేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారికి పట్టు వస్త్రాలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమర్పించారు. అంతకు ముందు మార్కెట్ యార్డు నుండి శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయం వరకు శివుడి ముఖ కవచాన్ని, పట్టువస్త్రాలు, కలశం ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అనంతరం ఎమ్మెల్యేకు అర్చకులు వేద ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ పెద్ద విజయకుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలీ, మార్కెట్ కమిటి డైరెక్టర్ వై.అచ్చన్న, పోల శ్రీనివాస్, కె. చంద్రశేఖర్, ఎం. లక్ష్మీనారాయణ, ఓంప్రకాష్, ఎం.ప్రకాష్, బి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**ఎమ్మెల్యేలకు సన్మానం...**

ఐఎన్‌టియుసి, విద్యుత్ (327) సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందించి ఘనంగా సన్మానించారు.

# ప్రభుత్వాసుపత్రిలో శిశువు మృతి..!

### సరైన సమయంలో వైద్యం అందక శిశువు మృతి...
### అబ్బాయి పుడితే 3000, అమ్మాయి పుడితే 1500 నర్సులకు లంచం ఇవ్వాల్సిందే....

**వనపర్తి ప్రతినిధి అక్టోబర్ 03 ప్రభాతవార్త :** వనపర్తి ప్రభుత్వం ఆస్పత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యంతో శిశువు మృతుకి కారణమయ్యారు అని బంధువులు హాస్పిటల్ ఎదురుగా తల్లిదండ్రులు ఆందోళన చేశారు. పెద్ద దగడ గ్రామానికి చెందిన అనూష, భర్త రాకేష్ వనపర్తి జిల్లా కేంద్రంలో మాత శిశు సంరక్షణ కేంద్రంలో మూడు రోజుల క్రితం హాస్పిటల్‌లో అడ్మిట్ కావడం జరిగింది. శిశువు నిండు నూరేళ్ల గడవకముందే, తల్లి కడుపు నుండి బయటికి రాకముందే శిశువు మృతికి గురి అయింది. డాక్టర్ నిర్లక్ష్యంతో సమయానికి డెలివరీ చేయకుండా నిర్లక్ష్యం వహించి శిశువును చంపారు అని తల్లిదండ్రులు బంధువులు హాస్పిటల్ బయట ఆందోళన చేపట్టారు, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు, నర్సులు పేషంట్లను పట్టించుకోకుండా గర్భిణీ స్త్రీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు అని పేషంట్లు అసహనం వ్యక్తం చేశారు,పురిటి నొప్పులతో బాధపడుతుంటే, నర్సులు, డాక్టర్లు, అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారు,సరైన సమయంలో గర్భిణీ స్త్రీలకు వైద్యం అందించకపోవడంతో, సతమతమవుతున్నారు. ఇక్కడ కావలసిన పరిజ్ఞానం లేకపోవడంతో, ఇక్కడికి వచ్చే పేషంట్లకు ఇబ్బందులు.. అమ్మాయి పుడితే 1500 రూపాయలు ఇవ్వాల్సిందే, బాబును చూపియ్యాలి – మిగతా4లో..




పభుత్వ ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన



మృతి చెందిన శిశువు

### గర్భిణీ స్త్రీలు ఇబ్బందికి గురి అవుతున్నాం



వనపర్తి జిల్లా ఎదుట్ల గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీ మనిషా భర్త కురుమూర్తి, మేము వచ్చి ఎనిమిది రోజులు గడుస్తున్నా సరైన సమయంలో వైద్యం అందించక పోవడం, మేము ఏమైనా అడిగితే పచ్చి బూతులు తిడుతూ తట్టుకోవాలి ఎవరికోసం అని మాకు డెలివరీ చేయడం లేదు నొప్పులు వస్తున్నాయి అని తెలిసిన కూడా నొప్పుల ఇంజక్షన్ ఇస్తాం, తగ్గుతుంది అని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. లేదంటే మీ ఇష్టం వచ్చిన దగ్గర పోయి చెప్పుకోండి అని బెదిరిస్తున్నారు.మాకు ,వైద్యం అందించాల్సిందిగా వైద్య అధికారులను వేడుకుంటున్నాం..

మనిషా గర్భిణీ స్త్రీ ఏదుట్ల వనపర్తి జిల్లా

### స్వచ్ఛ భారత్ అభియాన్లో చీపురుపట్టి

# చెత్త ఊడ్చిన ఎంపీ డీకే అరుణ



గద్వాల ఏరియా ఆసుపత్రిలో చీపురితో శుభ్రం చేస్తున్న ఎంపీ డీకే అరుణ

**గద్వాల, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యులు డీకే అరుణ గురువారం గద్వాలలోని ఏరియా హాస్పిటల్‌లో చీపురు పట్టి పరిశుభ్రం చేశారు. అక్టోబర్ 2 తో స్వచ్ఛ భారత్ అభియాన్‌కు 10 ఏళ్ల పూర్తి అయిందని ఎంపి తెలిపారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు గద్వాలలో స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి జాతీయ ఉపాధ్యాక్షురాలు మహబూబ్‌నగర్ ఎంపి డీకే అరుణ, స్థానిక బిజెపి నాయకులతో కలిసి శ్రమదానం చేశారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎంపీ డీకే గద్వాలలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చీపురు పట్టి చెత్త ఊడ్చారు. అదే విధంగా ఆసుపత్రి ఆవరణలో ఎంపీ డీకే అరుణ, బిజెపి నాయకులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, బిజెపి నాయకులు శివారెడ్డి, మాజీ చైర్మన్‌లు, కృష్ణవేణి, బండల పద్మావతి, బండల వెంకట్‌రాములు, కౌన్సిలర్ రామాంజనేయులు, రఘు గౌడ్ తదితరులు ఉన్నారు.

### కొనసాగుతున్న

# డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన..

### మహబూబ్‌నగర్ 217 మంది అభ్యర్థులు హాజరు
### ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్జెడి విజయలక్ష్మి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 03 ప్రభాతవార్త :** డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతున్నది. గురువారం మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఆర్జెడి విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిగ్రీ, బిఇడి పూర్తయిన అభ్యర్థులు ఆయా యూనివర్సిటీల నుంచి తప్పనిసరిగా కాన్వకేషన్ సమర్పించాలని తెలిపారు. డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన పకడ్బందీగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గురువారం స్కూల్ అసిస్టెంట్ తెలుగు 15, హిందీ 8, సాంఘిక శాస్త్రం 16, మేథమేటిక్స్, తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం కలిపి 16, సామాన్య శాస్త్రం 12, ఫిజికల్ ఎడ్యుకేషన్ రెండు, పిఇటి ఎనిమిది, ఎస్జీటి 140 మంది కలిపి మొత్తం 217 మంది అభ్యర్థులు పరిశీలనకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. ఆమె వెంట సిఎంఓ బాలుయాదవ్, బైకాని, సూపరింటెండెంట్ శంభుప్రసాద్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేస్తున్న ఆర్జెడి విజయలక్ష్మి

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:**మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా తెలంగాణ స్మారక నిధి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీ జ్ఞాన మందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు రఘురాం, రాజశేఖర్‌రావు మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర స్థాయి బెస్ట్ లెక్చరర్ అవార్డు గ్రహీత, ప్రైవేటు టీచింగ్ ఫ్యాకల్టీ ఫిజిక్స్ అరుణ్‌కుమార్‌లను సామాజికంగా చేస్తున్న సేవలను గుర్తించి శాలువా, జ్ఞాపిక మరియు ప్రశంస పత్రాలతో ఘనంగా సన్మానించారు. నేటి ప్రపంచ వ్యాప్తంగా సత్యం, అహింస, శాంతి, ప్రేమ వంటి ఆయుధాలే మానవళి అనుసరించాల్సిన మార్గలని, గాంధీజీ స్ఫూర్తితో మనమంతా జీవించాలని వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో తెలంగాణ స్మారక నిధి రాష్ట్ర అధ్యక్షులు జి.వి.సుబ్బారావు, సుప్రీంకోర్టు జనరల్ ముఖ్య సలహాదారు జస్టిస్ పీ.ఎస్. నారాయణ, ప్రముఖ కవిత, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

## కుల సంఘాలకు కాంగ్రెస్ పాలనలోనే ఆత్మగౌరవం

**కల్వకుర్తి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:**కుల సంఘాలకు కాంగ్రెస్ పాలనలోనే ఆత్మగౌరవం దక్కిందని మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 24 కుల సంఘాల భవనాలకు ప్రహరి నిర్మాణం, సీసీ రోడ్ల పనులకు ప్రొసిడింగ్ కాపీలను అందించారు. ఈ సందర్భంగా బృంగి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎస్‌డీఎఫ్ కింద పట్టణంలోని 24 కుల సంఘాలకు వివిధ పనుల అభివృద్ధి కోసం 107లక్షల నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. అసంపూర్తిగా మిగిలిన ఊర్ధుఘర్ ఫంక్షన్‌హాల్‌కు రూ.5లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు, మందుల సంఘం భవనానికి రూ.4లక్షలతో పాటు ఇతర కుల సంఘాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఏజాస్, షాన్‌వాజ్‌ఖాన్, చంద్రకాంత్‌రెడ్డి, సంతుయాదవ్, జమ్ముల శ్రీకాంత్, ఆయా కుల సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.


ప్రొసిడింగ్ కాపీలను అందజేస్తున్న బృంగి ఆనంద్‌కుమార్

## గ్రామాల ప్రజలు ఐక్యమత్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి:ఎస్ఐ

**అమరచింత అక్టోబర్ 03 ప్రభాతవార్త :** అమరచింత మండలంలోని ఆయ గ్రామాల ప్రజలు ఐక్యమత్యంతోనే గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై,బండారి సురేష్ ప్రజలను కోరారు. గురువారం అమరచింత మండలంలోని మిట్ట నందిమల్ల గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో నేరాలు నియంత్రణ కోసం రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు,యువకులు ప్రజలు ఐక్యమత్యంతో స్వచ్ఛందంగా గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సురేష్ ప్రజలను కోరారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లకు మెసేజ్‌లు పెట్టి ఓటీపీలు చెప్పండి అని అడిగితే చెప్పవద్దని అన్నారు. గ్రామాల ప్రజలు కలిసికట్టుగా ఉండి నేరాల నియంత్రణ కోసం సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సర్వారెడ్డి తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.


మిట్ట నందిమల్ల గ్రామంలో సీసీ కెమెరాల పై అవగాహన

## మండల విద్యాశాఖాధికారిగా చంద్రశేఖర్

**ఉప్పునుంతల,అక్టోబరు 03 ప్రభాతవార్త :** ఉప్పునుంతల మండల విద్యాధికారిగా కంసానిపల్లి హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం, నోడల్ అధికారి చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇంఛార్జిగా పని చేసిన రామారావు బదిలీపై హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వంగూరు మండల విద్యాధికారి శంకర్‌ను ఇంఛార్జి బాధ్యతలు అప్పగించారు. తర్వాత జరిగిన పరిణామాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ వారు సంయుక్తంగా రాష్ట్రంలో మండల విద్యాధికారిగా సీనియర్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు అప్పగించాలని ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలో సీనియర్‌గా పని చేస్తున్న కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న గజిటెడ్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌కు ఉప్పునుంతల మండల విద్యాశాఖాధికారిగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.



## బతుకమ్మ సంబరాలతో కోలాహలంగా మారిన గ్రామాలు

**ఉప్పునుంతల,అక్టోబరు 03 ప్రభాతవార్త :** దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బతుకమ్మ సంబరాలతో మండలంలో గ్రామాలు కోలాహలంగా మారాయి. గ్రామాలలో దుర్గామాత ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దుర్గామాత వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి, రాత్రివేళల్లో రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో కోట బురుజు వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలు అదేవిధంగా మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కొత్త శిరీష రవిందర్‌రావు ఆధ్వర్యంలో రంగు రంగుల పూలతో అలంకరించారు. అదేవిధంగా పెనిమిళ్ళ, వెల్టూరు,తాడూరు, మర్రిపల్లి, ఉప్పరిపల్లి, కంసానిపల్లి, లక్ష్మాపూర్, గ్రామాలలో దుర్గామాతను ప్రతిష్టించి దేవిశరన్నవరాత్రి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భక్తులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకెళ్తున్న మాజీ సర్పంచ్ శిరీష రవిందర్‌రావు

## ప్రారంభమైన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ఉప్పునుంతల,అక్టోబరు 03 ప్రభాతవార్త :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాలలో ఉత్సవ కమిటి సభ్యులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అలంకరించి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాలలో దుర్గామాతను ప్రతిష్టింపజేశారు. ఉత్సవంలో భాగంగా మొదటిరోజు గురువారం బాలత్రిపుర సుందరదేవిగా అమ్మవారు పూజలు అందుకున్నారు. అమ్మవారిని శ్రీ త్రిపుర సుందరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. దుర్గామాతకు నేత గులాబి పూలతో ప్రత్యేక పూజలు జరిపి పరమాన్నం నైవేద్యం సమర్పించారు. మండలంలోని కంసాన్‌పల్లిలో దుర్గామాత వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


కంసానిపల్లిలో బాల త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు

# ప్రారంభమైన దేవిశరన్నవరాత్రి వేడుకలు..

**దేవరకద్ర,అక్టోబరు03 ప్రభాతవార్త:** అమ్మలగన్నయమ్మ.. ముగురమ్మల మూలపుటమ్మ..అన్న కవివాక్కుకు నిక్కమైన నిదర్శనంగా భాసిల్లుతున్న కనకదుర్గ అమ్మవారి దేవిశరన్నవరాత్రి పర్వదిన వేడుకలు దేవరక ద్ర,కౌకుంట్ల మండలాల్లో ఆయా గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభ అయ్యాయ . దీనికి గాను ఆయా మండలాల్లో నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. చల్లని చూపులతో.. చిరుమందహాసంతో కనిపిస్తూ..ప్రేమ,కురుణ,వాత్సల్యం కురిపిస్తూ.ఆయా మండలాల్లోని గామాలలో మండపాలలో కొలువుదీరే దుర్గాదేవిని శరణుకోరితే శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.అందుకే ముక్కోటి దేవతలు సైతం అమ్మ కరుణ కటాక్షాలు తమపైన ఉండాలని దేవిని పూజిస్తారు.జగాన్ని పాలించే జగజ్జనని శరన్నవరాత్రి సంప్రదాయం పుట్టుకల వెనుక కొన్ని కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అలాంటి విశిష్టత గల దుర్గామాత వారిని ప్రతిష్టించి పూజించడానికి జిల్లాలోని ఆయా గ్రామాలలో అన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి గాను మండపాలను సిద్దంచేశారు. దాదాపు 9 రోజుల పాటు అమ్మవారిని సాంప్రదాయ రీతిలో పూజలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశారు.కనకదుర్గ అమ్మవారి దేవిశరన్నవరాత్రి పర్వదిన వేడుకలు మన సంస్కృతికి అద్దంపట్టే వేడుకలు. సాంప్రదాయానికి ఈ వేడుక ప్రతీక. ఇంతటి విశిష్టత గల వేడుకలలో అందరూ పాల్గొని అమ్మవారి ఆశిస్సులు పొందడానికి ప్రయత్నిస్తారు. దీనిని అందరూ ఓ అదృష్టంగా భావిస్తారు.దేవిశరన్నవరాత్రి పర్వదిన వేడుకలు ఎంతో పవిత్రమైనవి. ప్రతిరోజు అమ్మవారిని కొలిచి పాప విముక్తిపొందాలని భక్తులు ప్రయత్నిస్తారు.

**దేవరకద్రలో ప్రతిరోజు వివిధ రకాలలో అమ్మవారి అలంకరణ..**

దేవినవరాత్రి పర్వదిన వేడుకల సందర్భంగా దేవరకద్రలో గురువారం నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభయ్యాయి.ప్రతి రోజు దుర్గామాత అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమివ్వనున్నారు. దీనికి గాను స్థానిక పోచమ్మగుడి వద్ద మండపాన్ని ఏర్పాటు చేసి అన్ని ఏర్పాట్లు చేశారు.దేవరకద్రలో దేవిశరన్నవరాత్రి పర్వదిన వేడుకలకు అన్ని ఏర్పాటు చేయడం జరిగింది. స్థానిక పోచమ్మగుడి వద్ద దీనికి గాను అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ వేడుకలలో పట్టణ ప్రజలు అధికసంఖ్యలో పాల్గొంటారు. ప్రతి రోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.వేడుకల మొదటి రోజు అమ్మవారు స్వర్ణకవచాలకృత అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగో రెండవ రోజు బాల త్రిపురసుందరి, మూడవరోజు గాయత్రిదేవి,నాల్గవరోజు అన్నపూర్ణదేవి,ఐయిదవరోజు లలితత్రిపుర సుందరి,ఆరవరోజు మహాలక్ష్మీదేవి,ఏడోరోజు సరస్వతీ దేవి,ఎనిమిదవరోజు దర్గామాత,తొమ్మిదవ రోజు మహిశాసురమర్దని, పదోరోజు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దుర్గామాత అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు నిర్వహకులు తెలిపారు.


దేవరకద్రలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

**అమ్మవారికి ప్రశాంత్‌రెడ్డి పూజలు..**

వేడుకల మొదటి రోజు అమ్మవారికి దేవరకద్ర నియోజకవర్గ బిజేపి ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు,జిల్లా కార్యదర్శి నారాణరెడ్డి,అమ్మవారి ఉత్సవకమిటీ సభ్యులు కొండ శ్రీను,భాస్కర్, తిప్పారెడ్డి,భవాని,మేస్త్రీ వెంకటేశ్,కొండ హనుమంత్‌రెడ్డిలతో పాటు గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

- కరుణించమ్మా... కనకదుర్గామ్మా..
- ముస్తాబైన మండపాలు
- ప్రతిరోజు వివిధ రూపాలలో అమ్మవారి దర్శనం
- ఆయా గ్రామాలలో పూజలు అందుకోనున్న అమ్మవారు

**వాసవిమాత ఆలయంలో..**

దేవరకద్రలోని శ్రీ వాసవిమాత ఆలయంలో దేవిశరన్నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ కూడ ప్రతి రోజు అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి ఏడాది ఈ వేడుకలను దేవస్థానంలో అత్యంత ఘనంగా నిర్వహించడం అయవాయితీగా వస్తుంది.అందులోభాగంగానే ఈఏడాది కూడ వేడుకలను అన్ని ఏర్పాట్లుచేశారు.ఈసందర్భంగా అర్చకుడు హరిశంకరశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి వివిధపూజలు చేశారు.ఈకార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ కల్వకన్నయ్యశెట్టి,గుద్దేటి మంజుల రాణి,గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**లక్ష్మీపల్లిలో..**

దేవరకద్ర మండలం లక్ష్మీపల్లిలోని శ్రీ కనదుర్గాదేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది లక్ష్మీపల్లిలో ఈ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం అయవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వహకులు మొసలి ప్రతాప్‌రెడ్డి,పుష్పలత దంపతులు తెలిపారు. ప్రతిరోజు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను దేవస్థానంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. మొదటి రోజు అమ్మవారికి వివిద పూజలు చేశారు.

### వాసవి మాత ఆలయంలో ఘనంగా

# ప్రారంభమైన దసరా నవరాత్రి ఉత్సవాలు

**మక్తల్ టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** పట్టణంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవిమాత బాల త్రిపుర సుందరిదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఉదయం గణపతి ప్రార్ధన స్వస్తి పుణ్యా వచనము ధ్వజారోహణము కంకణ ధారణ నవకలశ స్థాపన, సాయంత్రం బతుకమ్మ ఆటపాటలతో, దండియా నృత్యాలతో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కోరికలు తీర్చుకుంటున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నామని ఈ సంవత్సరం కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని, కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా అమ్మవారు కొలువై ఉన్నారని, అమ్మవారి గుడి స్థాపన సమయంలో చిన్నజీయర్‌స్వామి వారు సాక్షాత్తు అమ్మవారి ఇక్కడ వచ్చి కొలువై ఉన్నారని ఈ క్షేత్రం ఎంతో పవిత్రమైనదని ఇక్కడ ఏదైనా కోరిక కోరుకుంటే ఖచ్చితంగా నెరవేరుతుందని స్వామివారు చెప్పారు. సాయంత్రం అమ్మవారు అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. మొదటి రోజు చిన్నారులు, మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయినారు. అనంతరం వచ్చిన భక్తులకు అల్పాహారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, పట్టణ ప్రజలు, భక్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

# ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభం...

**తొగుట వీరా క్షత్రియ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహం.. భవాని సేన ఆధ్వర్యంలో కొలువైన అమ్మవారు**

**వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో కలశాలతో ప్రారంభమైన ఉత్సవాలు**

**పెబ్బేరు అక్టోబర్ 03 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో దుర్గాదేవి నవరాత్రులు ఉత్సవాల సందర్భంగా పెబ్బేరులో భవాని సేన యూత్ సభ్యులు, శ్రీ తొగుట వవీర క్షత్రియ సేవా సంఘం సభ్యులు, శ్రీ వాసవి మాత ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి కలశాల బతుకమ్మలతో, భజన కీర్తనలతో అమ్మవారిని పుర వీధుల్ల గుండా ఊరేగిస్తూ స్థానిక సుభాష్ చౌరస్తా వద్ద నుంచి భవాని సేన సభ్యులు ఏర్పాటు చేసిన చిన్న చౌడేశ్వరి దేవి ఆలయంలోకి విగ్రహాన్ని నిలబెట్టారు. తొగుట వీర క్షత్రియులు ఏర్పాటుచేసిన విగ్రహ ఊరేగింపు, కలశాలతో శ్రీ తోగుట చౌడేశ్వరి దేవి ఆలయం వరకు శోభయాత్ర గా అమ్మవారిని ఘనంగా ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేయడం జరిగింది. అనంతరం శ్రీ వాసవి మాత ఆలయ కమిటీ సభ్యులు బతుకమ్మలతో , కలశాలతో అంగరంగ వైభవంగా శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి బతుకమ్మలను ఆడుతూ, శ్రీ వాసవి మాత ఆలయం వరకు శోభయాత్ర చేశారు. కార్యక్రమంలో పెబ్బేర్ వివిధ ఆలయాల కమిటీ సభ్యులు, హిందూ జాగృతం సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అమ్మవారిని పూర విధుల గుండా ఊరేగిస్తున్న దృశ్యం

# అలుగును నిర్మించాలని కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి

**నారాయణపేట టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** కోటకొండ గ్రామం మల్లెలవాని చెరువు అలుగు పునర్నిర్మించాలని కోరుతూ గురువా రం మండల పరిధిలోని కోటకొండ గ్రామం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు, రైతుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకులు నరసింహ కలెక్టర్‌తో మాట్లాడుతూ గత నెలలో కురిసిన భారీ వర్షాలతో చెరువు పూర్తిగా నిండడంతో అలుగు పారడం తోపాటు పాక్షికంగా దెబ్బతినడం జరిగింది. దీంతో కోటకొండ గ్రామ రైతులు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో రెవెన్యూ అధికారులు ఇరిగేషన్ అధికారులు వచ్చి అలుగు దగ్గర వాటర్ పోవడానికి గోడను తొలగించారన్నారు. అధికారులు స్పందించి వర్షాలు లేని సమయంలో అలుగు పనులను త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మల్లెల చెరువు అలుగు పునర్నిర్మాణం పూర్తిగా చేసి భవిష్యత్తులో ఎలాంటి వర్షాలకు ప్రమాదం లేకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండెగారి లక్ష్మణ్, తీగలి రఘు, బాయికాడి రాజు, ఎదురింటి నరసింహ, జెట్టి అంజి, జెట్టి శ్రీను, జట్టి నరసింహులు, జెట్టిరాజు బల్ల చంద్రప్ప, బల్లరాజు, బాయికాడి రాజు, ఎదిరింటి రాములు తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

# ఘనంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం...

**ఆత్మకూరు అక్టోబర్ 03 ప్రభాతవార్త :** దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గురువారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం,నీలకంఠేశ్వర స్వామి ఆలయాలలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టింపజేసి నవరాత్రి ఉత్సవాలలో ఘనంగా ప్రారంభించారు. బాల పరమేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్టించినటువంటి అమ్మవారి విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సైతం ఆత్మకూర్ స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న శరన్న నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాటు చేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గాడి లక్ష్మీనారాయణ తో పాటుగా పలువురు స్వర్ణకారులు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించినటువంటి అమ్మవారు

# చదువుకున్న పాఠశాలకు ఆర్థిక సహాయం అందించిన శ్రీహరి రెడ్డి

**పెబ్బేరు అక్టోబర్ 03 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం యాపర్ల గ్రామానికి చెందిన సూదిరెడ్డి శ్రీహరి రెడ్డి తండ్రి నరేందర్ రెడ్డి ప్రేమ,వాత్సల్యంతో ఎదిగిన శ్రీహరి రెడ్డి ఈ పితృ పక్షాలలో తమ పెద్దలను స్మరించుకోవడానికి యాపర్ల గ్రామానికి వచ్చిన పుడు తాను చదవుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరతరాలు విద్యనభ్యసించవలసిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడం చూసి చలించి పోయారు. భవనాన్ని పటిష్ట నిర్మాణం చేపట్టడం కోసం వెంటనే రూ.50,000/-లు గ్రామ పెద్దలకు అందజేశారు. అవసరమైతే మరింత డబ్బును కూడా అందజేస్తానని హామీ ఇచ్చారు.కన్న తల్లి ఋణం తీర్చుకున్నట్లుగా చదువుల తల్లి కోవెల ఋణం తీర్చుకుంటున్న సూదిరెడ్డి శ్రీహరి రెడ్డి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పక్షాన, గ్రామ పెద్దలు ధన్యవాదాలు తెలియజేశారు.



## వైష్ణవిని సన్మానం

**గద్వాల,అక్టోబర్ 3 ప్రభాతవార్త:** ఎంబీబీఎస్ సీటు సాధించిన వైష్ణవిని జోగులాంబ గద్వాల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాసు హనుమంతు నాయుడు గురువారం తన కార్యాలయంలో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఎర్రమట్టి విధికి చెందిన మెగా ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు బోయ జమ్మన్న కుమార్తె వైష్ణవి ఎంబిబిఎస్ సీటు సాధించిన సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో మోనేష్, శేఖర్‌నాయుడు, రాము, రాయపురం వీరేశ్, రవి, కామేష్, తదితరులు ఉన్నారు.



## తగ్గిన కోయిల్‌సాగర్ నీటి నిల్వ

**-ఆయకట్టుకు నీటిసరఫరా ప్రారంభం**

**దేవరకద్ర,అక్టోబరు 03 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నీటిమట్టం గురువారం 32.3ఫీట్లకు తగ్గింది.వర్షాలు కురువకపోవడంతో ప్రాజెక్టులో రోజు రోజుకు ప్రాజెక్టులోకి వచ్చి చేరే నీటి ఉధృతి క్రమేపి తగ్గుముఖం పడుతుంది.దీంతో ప్రాజెక్టు షెట్టర్లను ఇటీవల మూసివేశారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. వర్షాలు తగ్గడంతో ప్రాజెక్టులోకి వచ్చి చేరే అంకిళ్ళ,కోయిలకొండ పెద్దవాగుల నుండి నీరు ప్రాజెక్టులోకి పెద్దగా వచ్చి చేరడం లేదు.దీంతో ప్రాజెక్టులో నీటి స్థోమత తగ్గింది. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరడంతో కోయిల్‌సాగర్‌కు జలకళ వచ్చింది. జలసవ్వడి చూపరులను మంత్రముగ్దులను చేస్తుంది.ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుంది. ప్రాజెక్టులో కనుచూపు మేర నీరే కనిపిస్తుంది.ఇది ఇలా ఉండగా ప్రాజెక్టు నుండి ఆయకట్టుకు నీటిసరాఫరాను ప్రారంబించారు.

## దేవరకద్రలో కాషాయ జెండావిష్కరణ చేసిన ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర,అక్టోబరు 03 ప్రభాతవార్త:** దేవరకద్రలో గురువారం బిజేపి దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి కాషాయజెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.దేవీనవరాత్రి వేడుకల సందర్భంగా స్థానిక పోచమ్మగుడి వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు,జిల్లా కార్యదర్శి నారాణరెడ్డి,అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు కొండ శ్రీను,భాస్కర్,తిప్పారెడ్డి,భవాని,మేస్త్రీ వెంకటేశ్,కొండ హనుమంత్‌రెడ్డిలతో పాటు గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు పాల్గొన్నారు.



## రూ.10వేలు ధర పలికిన కందులు

**దేవరకద్ర,అక్టోబరు 03 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు గురువారం రైతులు 134 కింటాళ్ళ కందులను విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.10వేలు ధర పలికింది.అతి తక్కువగా రూ.9850 ధర పలికింది.అలాగే 21 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ.5950 ధర పలికింది.అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి..

**ఉప్పునుంతల,అక్టోబరు 03 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ మోహన్‌లాల్ కోరారు. మండలంలోని ప్రజలు మీ సేవలో స్లాట్‌బుక్ చేసుకున్న వారు ఈనెల 8నుంచి 29 వరకు జరిగే సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ మోహన్‌లాల్ వివరించారు. శారీరక దివ్యాంగులు ఈనెల 8,15, 22,29 తేదీలలో వినికిడి లోపం గల దివ్యాంగుల సదరం క్యాంపు ఈనెల 16,23 తేదీలలో ఉంటుందని, మీ సేవలో స్లాట్‌బుక్ చేసుకున్న వారు మాత్రమే ఈ సందరం క్యాంపుకు వెళ్లాలని ఎంపిడిఓ మోహన్‌లాల్ సూచించారు.

## బాల త్రిపుర సుందరి దేవిగా దుర్గామాత

**చిన్నచింతకుంట,అక్టోబరు 03 ప్రభాతవార్త :** దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రా రంభమయ్యాయి. మండల కేంద్రం లోని గంగాభవాని ఆలయం లాలుకో ట, ముచ్చింతల, కురుమూర్తి, తిరుమలపురం తదితర గ్రామాలలో అ మ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. భక్తులకు బాలా త్రిపుర సుం దరి దేవిగా దర్శనమిచ్చారు. రాత్రికి బతుకమ్మతో మహిళలు బొడ్డెమ్మలు వేస్తూ సంబరాలు జరుపుకున్నారు.



## హైమాక్స్ లైట్ల నిర్మాణానికి భూమి పూజ

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**వెల్దండ, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని విధాల కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండలం కంటోనిపల్లి గ్రామంలో హైమాక్స్ లైట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలా అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అన్ని విధాలుగా కృషి చేస్తానని, త్వరలోనే కంటోనిపల్లి నుంచి మండల కేంద్రానికి బీటి రోడ్డుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ మాజీ సర్పంచ్ రామకృష్ణ ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్య,ఉప సర్పంచ్ సురేందర్, పంచాయతీ కార్యదర్శి ఫయాజ్, నాయకులు పర్వత్‌రెడ్డి, శేఖర్, కృష్ణ ముదిరాజ్, శ్రీను ముదిరాజ్; రమేష్, రాజుయాదవ్, రషీద్, శ్రీనివాస్‌యాదవ్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.



హైమాక్స్ లైట్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

## సీతారాంపేటలో డిజిటల్ సర్వే

**పర్యవేక్షించిన భూసేకరణ స్పెషల్ కలెక్టర్ రామ్‌రెడ్డి**

**చిన్నచింతకుంట,అక్టోబరు 03 ప్రభాతవార్త :** కుటుంబ డిజిటల్ గుర్తింపు కార్డు ఇంటింటి సర్వే పైలట్ ప్రాజెక్టుగా మండల పరిధిలోని సీతారాంపేట గ్రామాన్ని ఎంపిక చేశారు. గురువారం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ రాంరెడ్డి మొదటిరోజు కుటుంబం డిజిటల్ సర్వేలో పాల్గొన్నారు. కుటుంబ డిజిటల్ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్, దేవరకద్ర ఎంపిడిఓ శ్రీనివాస్‌రావు ఎంపిఓ అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



డిజిటల్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న స్కూల్ సిబ్బంది

**చిన్నచింతకుంట,అక్టోబరు 03 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని సాందీప పాఠశాలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కాంతయ్య పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్యలు మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు కూడా తెలియజేయాలనే ఉద్దేశంతో మా పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే మన సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను చుట్టూ బొడ్డెమ్మలతో విద్యార్థినిలు ఆడి పాడుతూ సంతోషంగా గడిపారు. అనంతరం సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం సుధాకర్, నవీన్, వెంకటేష్, రాగిణి, రేవతి, కవిత, శ్రీలత, ఫాతిమా, సౌమ్య, రమ్య, మేఘనతో పాటు విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మార్గదర్శి పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

**కృష్ణ,అక్టోబరు 03 ప్రభాతవార్త :** మండలంలోని గుడెబల్లూరు గ్రామంలో మార్గదర్శి పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకలలో విద్యార్థినిల నృత్యాలు, కోలాటంతో మెప్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డి.నరసింహులు, మేనేజ్‌మెంట్ అధ్యక్షులు ప్రహ్లాదరెడ్డి, మాగనూరు మార్గదంర్శి విద్యాలయ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి, పేరెంట్స్ కమిటి అధ్యక్షులు పూజారి లక్ష్మన్న, పాఠశాల ప్రిన్సిపల్ భీమ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలత, ఉపాధ్యాయులు చైతన్య, లలిత, అంబు, రేణుక, మహేశ్వరి, నికిత, సానియా, లక్ష్మణ్, నవీన్‌కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాలలో విద్యార్థులు

## సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలి..

**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు అధికారులకు ఆదేశాలు**

**గద్వాల, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** గురువారం కేటీదొడ్డి మండలంలోని మైలగడ్డ గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ కార్డుల జారీ కోసం పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమం కింద చేపడుతున్న ప్రయోగాత్మక ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రతి ఇంటింటికి వెళ్లి వారి పూర్తి సమాచారాన్ని సర్వే ఫారంలో నమోదు చేయాలని సూచించారు. సర్వేను పకడ్బందీగా తప్పులు లేకుండా కుటుంబంలో ఎంత మంది ఉన్నారో, వారి వివరాలు, నమోదు చేయాలని అన్నారు. వివరాలు సేకరించిన అనంతరం కుటుంబ సభ్యుల ఫోటోలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఓ కృష్ణ మోహన్, ఇంచార్జి తాహసిల్దార్ శివ శంకర్, ఆర్ఐ దేవేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడి టీచర్స్ తదితరులు ఉన్నారు.



ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

## మలేషియాలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు...

**వెల్దండ, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** మలేషియా దేశంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దుర్గామాత దేవాలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని గురువారం దుర్గామాతను వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణతో పాటు పలువురు నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో బుచ్చయ్య, వెంకట్‌రెడ్డి, సత్యం, రమేష్‌రెడ్డి, శేఖర్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## గజలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనం...

**వెల్దండ, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో దసరా శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారిని భక్తి శ్రద్ధలతో ప్రతిష్టించారు. మండల కేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాస తిరుపతయ్య రమాదేవీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఉత్సవకమిటీ అధ్యక్షుల పూరిఅనిల్, ప్రధానకార్యదర్శి బిక్కుమండ్ల రాజు,కోశాధికారి పాలాదిసంతోష్,సంఘ నాయకులు మిర్యాల రాజయ్య, పూరి వజ్రలింగం, జూలూరి ఈశ్వరయ్య, అలంపల్లి కృష్ణ, జూలూరి బాలస్వామి, ఉప్పుల సంతోష్, లక్ష్మినారాయణ, శ్రీకాంత్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనను

# అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:** తెలంగాణ డీఎస్సీ 2024 ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లాలో డీఎస్సీ క్వాలీఫై 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థులందరికి ఫోన్ కాల్స్ ద్వారా తప్పనిసరిగా సమాచారమిచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా సజావుగా చేపట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2024 డీఎస్సీ నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని గురువారం జిల్లా కేంద్రాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించే కార్యక్రమాన్ని కలెక్టర్ నిశితింగా పరిశీలించారు. రోజుకు ఎంత మంది అభ్యర్థులు ధృవపత్రాలను పరిశీలిస్తున్నారని, ఏ ఏ అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి ఎంత సమయం పడుతుందని, అభ్యర్థుల నుంచి ఏ ఏ ధృవపత్రాలను పరిశీలిస్తున్నారని తదితర వివరాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ 2024రాత పరీక్షలో ఎంపికై 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసిన ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఫోన్ ద్వారా సమాచారమిచ్చి ఎంపికైన ప్రతి అభ్యర్థి ధృవపత్రాల పరిశీలనకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 5వ తేదీ వరకు మెరిట్ జాబితా ఆధారంగా 1:3 ప్రకారం ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల ధృవపత్రాలను అత్యంత పకడ్బందిగా, సజావుగా పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఏం.గోవిందరాజులు, ప్రభుత్వ పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, నోడల్ అధికారి కుర్మయ్య, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దిన్, నూరుద్దిన్, మురళీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, తిరుపతయ్య, వెంకటేశ్వర శెట్టి తదితరులు ఉన్నారు.





సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

# అత్యంత వైభవోపేతంగా వాసవీమాత ఉత్సవ విగ్రహా ఊరేగింపు

**- అలరించిన కోలాటాలు, డప్పు వాయిధ్యాలు... - బాలత్రిపుర సుందరీ దేవీ అలంకరణలో వాసవీమాత...**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,అక్టోబర్ 03 ప్రభాతవార్త:** శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 54వ దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో గల శివాలయం నుంచి కలశం మరియు ఉత్సవ విగ్రహ శోభయాత్ర అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా నిర్వహించారు. శివాలయంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు రజిత హరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలాటాలు డప్పు వాయిధ్యాలతో నిర్వహించిన యాత్ర సుమారు 4 గంటల పాటు ప్రధాన రహదారిపై కొనసాగింది. యాత్రలో పట్టణంలోని వందలాది ఆర్య వైశ్య కుటుంబాలు, శ్రీనివాస సిండికేట్ మరియు పలు మహిళా సిండికేట్లు,ఆర్యవైశ్య సిండికేట్లు కిరాణం మరియుజనరల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవిమాతను మొదటి రోజు బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పాండురంగశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీమాత భక్తులకు బాల త్రిపుర సుందరీ దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంకాల పూజ కార్యక్రమాల అనంతరం గాజుల అలంకరణ, గాజుల అభిషేకం నిర్వహించారు. అనంతరం డాక్టర్ దీక్షితులు ఆధ్వర్యంలో భక్తి గీతాల ఆలాపన ప్రవచనాలు కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య పుర ప్రముఖులు, వ్యాపార వాణిజ్య సంఘాలు అశేషంగా భక్తులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



ఉత్సవ విగ్రహా శోభయాత్రలో కోలాటాలు చేస్తున్న దృశ్యం

# దేవి నవరాత్రుల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కొత్తకోట అక్టోబర్ 03 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం పామపురం గ్రామంలో దుర్గా నవరాత్రుల సందర్భంగా శ్రీ ఆంజేయ స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ, ఆంజనేయ స్వామిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దర్శించుకున్నారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు రోడ్ వెయ్యాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి మఖ్తల్ నియోజకవర్గం ఆత్మకూరు మండలం వీరరాఘవపురం నుండి పామాపురం వెళ్లే రహదారిని పరిశీలించి మఖ్తల్ ఎమ్మెల్యేతో కలిసి రోడ్డు నిర్మాణానికి ప్రపోసల్స్ తయారు చేసి, త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం చిన్న చెరువు నుండి పంట పొలాలకు వెళ్లే కాలువలో జమ్ము, ముండ్ల పొదలు నిండుగా మొలిచిందని జమ్మును, ముండ్ల చెట్లను తొలగించాలని గ్రామ రైతులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వెంటనే కాల్వను పరిశీలించి సిల్ట్ తీయించాలని గ్రామ సెక్రటరీకి ఆదేశించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శాస్త్ర చికిత్స చేయుంచుకున్న కుమ్మరి రాములు పరామర్శించి, గంధం మధు సోదరి పట్టుచీర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీచుపల్లి యాదవ్, సీనియర్ నాయకులు రావుల కర్ణాకర్ రెడ్డి, గొల్లబాబు, వేముల శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఉమ మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,మాసన్న తదితరులు పాల్గొన్నారు.



దేవి నవరాత్రుల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



రోడ్ వెయ్యాలని ఎమ్మెల్యే కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

# ఆలయ కమిటీ సభ్యుడిగా జోగుల సరస్వతి నియామకం

**నేడే ఆలయ కమిటీ సభ్యుడిగా పదవీ ప్రమాణ స్వీకారం**

**అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన జోగుల సరస్వతి, రవి**

**ఇటిక్యాల అక్టోబర్ 3 ప్రభాతవార్త :** అల్లంపూర్ పట్టణంలో వెలసిన ఐదవ శక్తిపీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా 2 రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారులు నియమిస్తూ జీవో ను విడుదల చేశారు. అలాగే వీరితో పాటు మరో 12 మందిరి కమిటీ సభ్యులుగా నియమించారు. జోగులాంబ ఆలయ కమిటీ సభ్యులుగా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి గ్రామపంచాయతీకి చెందిన జోగుల సరస్వతి ని నియమించారు. దీంతో శుక్రవారం ఆలయంలో కమిటీ సభ్యులుగా పదవి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎర్రవల్లి గ్రామపంచాయతీ నుండి ఆమె భర్త తాజా మజీ సర్పంచ్ గా జోగుల రవి పని చేశారుజ అంతేకాక జోగుల రవి కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకునిగా అల్లంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఆయన సతీమణి జోగుల సరస్వతి జోగులాంబ ఆలయ కమిటీ లో సభ్యురాలుగా పదవి ప్రమాణం శ్రీకాకం చేస్తుండటంతో ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా జోగులంబ ఆయన కమిటీ సభ్యులుగా నియమించినందుకు ఏఐసీసీ కార్యదర్శి చత్తీష్ ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పార్లమెంట్ ఎన్నికల సమయంలో

# పని చేయని వీవీ ప్యాట్లను హైదరాబాద్‌కు తరలింపు...

**గద్వాల, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల సమ యంలో పనిచేయలి వీవీ ప్యాట్లను ఈ.సి.ఐ.యల్ హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ తెలిపారు. గురువా రం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల ఈ.వీ.యం గోడౌన్ ను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎం గోదాములో నెల సరి తనిఖీలో భాగంగా గోదాములో ఉన్న అన్ని ఈవీఎంలు, వీవీ ప్యాట్లను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు 2024 పార్ల మెంట్ ఎన్నికలలో పోలింగ్‌సమయంలో పనిచేయని 8వీవీ ప్యాట్లను సక్రమంగా పని చేయని వాటిని హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఈసిఐఎల్ కు సురక్షితంగా తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరిడెంట్ నరేష్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



వీవీ ప్యాట్లను హైదరాబాద్ కు తరలిస్తున్న అధికారులు

## రాష్ట్రస్థాయి పోటీలకు జడ్చర్ల విద్యార్థి జీవన్

**జడ్చర్ల,అక్టోబరు 03 ప్రభాతవార్త :** జడ్చర్ల ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలో ఎంపిసి ప్రథమ సంవత్సరం చదువుతున్న జీవన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 7,8 తేదీల్లో వరంగల్ జిల్లా జరిగే 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల 20 సంవత్సరాల లోపు బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలలో పాలమూరు జిల్లా తరపున 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లలో పాల్గొననున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్, అధ్యాపకులు రామకృష్ణగౌడ్, రఘురాం, అధ్యాపకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి ప్రతిభ చాటి కళాశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



విద్యార్థి జీవన్

## ఘనంగా మహాపసుపు బండారు పూజ

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్02,ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వారం గ్రామంలో గురువారం త్రిశక్తి పీఠం శ్రీ ఆదిత్యా పరాశ్రీ స్వామి గారి ఆధ్వర్యంలో మహ పసుపు బండారు పూజ కార్యక్రమం జరిగింది. భక్తులు వేల సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం శ్రీఆదిత్య పరశ్రీస్వామి మాట్లాడుతూ అక్కడి అమ్మవారు చాలా శక్తి వంతమైన అమ్మవారు భక్తులు మనస్ఫూర్తిగా నమ్మి కోరుకున్న కోరికలు తీర్చే కరుణామయురాలు అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని ముగ్గురు అమ్మవార్లు ఒకే దగ్గర ఉండటం ఇక్కడి ప్రత్యేకత అని తెలియజేసారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఇక్కడ ప్రతిరోజు పూజకార్యక్రమాలు జరుగుతుంటాయని భక్తులు కుటుంబసభ్యులతో కలిసి అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో క్షేత్రనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.





బిజ్వారం గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

## సెల్‌ఫోన్ అప్పగించిన పోలీసులు

**దేవరకద్ర,అక్టోబరు 03 ప్రభాతవార్త :** ఓ యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం పోలీసులు ఆయనకు అప్పగించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దేవరకద్ర మండలం నాగారం గ్రామానికి చెందిన నరేష్ గతనెల 10న తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు సిఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్‌ను ఎస్సై నాగన్న,బాధితుడు నరేష్‌కు అప్పగించారు. దీంతో నరేష్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## డిగ్రీ పట్టాభద్రులకు సర్టిఫికెట్లు అందజేత

**మక్తల్ టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** పట్టణంలో అయ్యప్ప డిగ్రీ కాలేజీలో గురువారం దాదాపు 60 మంది విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో విద్యనందించి మక్తల్‌లోనే డిగ్రీ కళాశాలను స్థాపించి ప్రతి సంవత్సరం వందలమంది విద్యార్థులకు విద్యనందించి డిగ్రీ సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుంది. కార్యక్రమంలో డైరెక్టర్లు అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, హరిప్రసాద్, అనంత్‌రెడ్డి, గోవర్ధన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో చెంచు యువకుడు అదృశ్యం

**లింగాల,అక్టోబరు 03 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రపెంట గ్రామానికి చెందిన యువకుడు అటవీ ప్రాంతంలో అదృశ్యమైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తులు ఫారెస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం ఎర్రపెంట గ్రామానికి చెందిన నిమ్మల శంకర్, తండ్రి వీరయ్య అనే యువకుడు గత వారం రోజుల క్రితం శనివారం అడవి ప్రాంతంలోకి వెళ్లాడు. తిరిగి రాకపోయే సరికి ఫారెస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం పోలీసులు, ఫారెస్టు అధికారులు, గ్రామస్తులు కలిసి అడవి ప్రాంతంలోకి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా యువకుడి ఆచూకీ తెలియలేదని తెలిపారు.



గాలిస్తున్న ఫారెస్టు, పోలీసులు, గ్రామస్తులు

## అర్హులందరికి సంక్షేమ పథకాలు..

**మొదటి పేజీ తరువాయి**

సమాచారాన్ని నిక్షిప్తం చేస్తారని, ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం నిజమైన లబ్దిదారులకు అందించేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఆరోగ్య శ్రీ, రైతు రుణమాఫీ, రైతుబంధు, రేషన్ సరుకులు, పెన్షన్ ఇలా ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకే అందించే ఉద్దేశంతో ఈ సర్వే చేస్తున్నామని ఆయన చెప్పారు. రాజస్తాన్ లాంటి రాష్ట్రంలో ఇప్పటికే ఈ ప్రక్రియ విజయవంతంగా నిర్వహిస్తున్నారని అదేవిధంగా మన రాష్ట్రంలో కూడా డిజిటల్ కార్డు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రారంభమైందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ స్వప్న లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ తహసిల్దార్ ఘన్సీరాం, గ్రామీణ తహసిల్దార్ సుందర్‌రాజు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, రాములు యాదవ్, అజ్మత్ అలీ, ఫయాజ్ పాల్గొన్నారు.

## సర్వేను పకడ్బందీగా నిర్వర్తించాలి...

**మొదటి పేజీ తరువాయి**

కావాలన్నారు. ముందుగా గ్రామాల్లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే చేపడుతున్నామని, గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహణ పరిశీలన కొరకు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రత్యేక అధికారిగగా రవి(ఐఎఎస్)ని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ఏ ఏ అంశాలను పొందాపర్చాలనే వివరాలను నివేధిక రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు 5 రోజుల పాటు నిర్వహించే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో కుటుంబ సభ్యుల వివరాల నమోదు, మార్పులు చేర్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వద్దని తెలిపారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తిన తమకు తెలియజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సర్వే నిర్వహణకు వచ్చిన బృందాలకు ప్రజలు వారి కుటుంబాలకు సంబంధించిన అన్ని వివరాలు అధికారులకు సమగ్రంగా అందజేయాలన్నారు. డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేకు విజయవంతంగా నిర్వహణకు అధికారులకు, ప్రజలు సహకరించాలన్నారు.

## డిజిటల్ కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి..

**మొదటి పేజీ తరువాయి**

ఆమె సంబంధిత అధికారులకు సమస్య గురించి చెప్పాలని ఎంపిడిఓకు సూచించారు. అనంతరం కలెక్టర్ నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని పైలెట్ వార్డు అయిన 15వ వార్డులో ఓ ఇంటికి వెళ్లి డిజిటల్ సర్వే తీరును పరిశీలించారు. ఆయా కార్యక్రమాలలో ఉట్కూర్ ఎంపిడిఓ ధనుంజయగౌడ్, ఎంపిఓ లక్ష్మి నరసింహ, నారాయణపేట మున్సిపల్ కమిషనర్ సునిత, దామరగిద్ద ఎంపిడిఓ సాయి లక్ష్మి, ఎంపిఓ పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో శిశువు మృతి..!

**మొదటి పేజీ తరువాయి**

అనుకుంటే 500 రూపాయలు లంచం ఇవ్వాల్సిందే డబ్బులు ఇవ్వకుంటే బేబిని సరైన సమయంలో తల్లిదండ్రులకు అప్పగించడంలో ఆలస్యం చేసి,నాన్న ఇబ్బందులకు గురి చేస్తుంటారు అని ఆరోపించారు ఆందోళనలు చేస్తున్నారు అని తెలుసుకున్న ఎస్పై జలంధర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి డాక్టర్లతో బాధిత బంధువులతో మాట్లాడిన ఆయన మీకు ఏదైనా సమస్య ఉంటే రాత పూర్వకంగా దరఖాస్తు ఇవ్వండి అధికారులకు సమస్యను తెలియపరుస్తాం అని సద్దుమనించారు.

**డాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు..**



వనపర్తి జిల్లా రాయినిపల్లి గ్రామానికి చెందిన వసంత మాట్లాడుతూ గతంలో నేను ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం తీసుకొని,ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యాను అప్పుడు వసతులు బాగా ఉన్నాయి, రెండో డెలివరీ కోసం నేను వనపర్తి జిల్లా ఆసుపత్రికి వచ్చాను, ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్లు, హెడ్ నర్సులు,స్టాఫ్ నర్సులు తీరు బాగాలేదు, గర్భిణీ స్త్రీలను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. 9 నెలలు దాటిన కూడా ప్రసూతి కాలం అయిపోయిన కూడా మమ్మల్ని పట్టించుకుంటలేరు అని అసహనం వ్యక్తం చేశారు.

**వసంత గర్భిణీ స్త్రీ రాయిని పల్లి గ్రామం వనపర్తి జిల్లా**

## పేటలో న్యాయవాదుల విధుల బహిష్కరణ

**నారాయణపేట టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** మాదన్నపేట సిసిఎస్ పోలీసులు న్యాయవాది అబ్దుల్ కలీంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం నారాయణపేట జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ దాడులు, హత్యలు సైతం జరుగుతున్నా పట్టించుకోవం లేదని అన్నారు. న్యాయవాదుల పరిరక్షణ కోసం ప్రత్యేకచట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నారెడ్డి, న్యాయవాదులు రఘువీర్ యాదవ్,లక్ష్మీపతి, నారాయణ, విజయ్‌భాస్కర్ రాజవర్ధన్‌రెడ్డి, మహబూబ్ అలీ, సతీష్, ప్రవీణ్ నామాజీ, వినోద్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడాకారున్ని సన్మానించిన కలెక్టర్

**నారాయణపేట టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** రెడ్ 3కె రన్‌లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించిన జిల్లాకు చెందిన సంక్షేమ అధికారి ఖలీల్ రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించిన కిరణ్‌కుమార్‌ను తీసుకువెళ్లి జిల్లా కలెక్టర్‌ను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖలీల్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రెడ్ త్రీ కె రన్‌లో జిల్లాలోని గుడూరు గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు కలెక్టర్‌కు తెలపగా రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని నారాయణపేట జిల్లాకు తీసుకువచ్చిన కిరణ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, శాలువా మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి ఖలీల్, వెల్ఫేర్ అధికారి మసూద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై శివకుమార్‌రెడ్డిని కలిసిన నాయకులు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 03 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని మల్‌రెడ్డిపల్లి బిసి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు మంజూరు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని కుంభం శివకుమార్‌రెడ్డి నివాసంలో సమస్యను విన్నవించడం జరిగింది. విషయంపై స్పందించిన శివకుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అదేవిధంగా మల్‌రెడ్డిపల్లి ఉలిగుండం రోడ్డుకు నిధులు మంజూరు చేసి త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. శివకుమార్‌రెడ్డిని కలిసిన వారిలో నాయకులు సాయిలు, మైపాల్, గోపాల్, శివ, బాల్‌రాజ్, లాలప్ప, అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా కే బాలచంద్రయ్య

**కొత్తకోట అక్టోబర్ 03 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా బాలచంద్రయ్యను నియమిస్తూ అందుకు సంబంధించిన పత్రాన్ని గురువారం దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీలో గత 40 సంవత్సరాలుగా ప్రజలకు పార్టీకి ఎంతో సేవలు చేశాడని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బాలచంద్రయ్య ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, జిల్లా కార్యదర్శులు బోయేజ్,కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి శ్రీనివాసులు , రవీందర్ రెడ్డి, ఆర్ వెంకటేష్, బాలరాజు యాదవ్, దిలీప్ రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు ఎస్సైల బదిలీలు

**మహబూబ్‌నగర్‌బ్యూరో, అక్టోబర్3,ప్రభాతవార్త:**ఉమ్మడి పాలమూరులో ఐదుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నలుగురు, వనపర్తిలో ఒకరు బదిలీఅయినట్లు జోగులాంబ జోన్ 2 డీఐజీ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల ఎస్సై లెనిన్, వంగూరు ఎస్సై మహేందర్, తెల్కపల్లి ఎస్సై మహేశ్, బిజినేపల్లి ఎస్సై నాగశేఖర్‌రెడ్డి లు నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా వీపనగండ్ల ఎస్సై నందికర్ రమేశ్‌ను వనపర్తి ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## మహారాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జిగా ఠాకూర్ బాలాజీసింగ్ ..

**- అధిష్టాన నమ్మకాన్ని నిలబెడుతా...**

**- మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్**

**కల్వకుర్తి, అక్టోబర్ 03 ప్రభాతవార్త:**అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. త్వరలో నిర్వహించే మహారాష్ట్ర ఎన్నికల్లో భాగంగా యావత్మాల్ జిల్లాలోని డిగ్రాస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనను నియమించడం పట్ల ఠాకూర్ బాలాజీసింగ్ హర్షం వ్యక్తం చేశారు. నేటి నుంచి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి లతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్

### సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా

# అమలు చేయడానికి ఫ్యామిలీ డిజిటల్‌కార్డులు

### పైలెట్ ప్రాజెక్టుగా కంటోనిపల్లి గ్రామం ఎంపిక :ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**వెల్దండ, అక్టోబర్ 03 ప్రభాతవార్త:**అర్హులైన పేద ప్రజలందరికి సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడానికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద వెల్దండ మండలం కంటోనిపల్లి గ్రామాన్ని ఎంపిక చేసి గురువారం డిజిటల్ కార్డు సర్వే నమోదు ప్రక్రియను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డు, రైతు భీమా, రైతు భరోసా, షాది ముబారక్, కళ్యాణలక్ష్మి, ఆసరా వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన 30 శాఖలు 30 రకాలుగా సమాచారం సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి కావున అర్హులైన వారందరు ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ఒకే కార్డు విధానం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఇందు కోసం ఈ నెల 8వ తేదీ వరకు డిజిటల్ కార్డు సర్వే నమోదును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే కార్డు ద్వారా సంక్షేమ పథకాలతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను ఎక్కడి నుంచి అయిన పొందడానికి వీలుంటుందన్నారు. ఒక క్లిక్‌తో కుటుంబ సమగ్ర సమాచారం ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ విధానం తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీఈఓ సత్యపాల్‌రెడ్డి, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్య, మాజీ సర్పంచ్ రామకృష్ణ, ఉప సర్పంచ్ సురేందర్, పంచాయతీ కార్యదర్శి ఫయాజ్, నాయకులు పర్వత్‌రెడ్డి, శేఖర్, కృష్ణ ముదిరాజ్, శ్రీను ముదిరాజ్; రమేష్, రాజుయాదవ్, రషీద్, శ్రీనివాస్‌యాదవ్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

## డిజిటల్ కార్డుల సర్వే సమర్ధవంతంగా చేపట్టాలి: స్పెషల్ ఆఫీసర్ రవి

**బిజినేపల్లి,అక్టోబరు 03 ప్రభాతవార్త :** ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను సమర్ధవంతంగా చేపట్టాలని ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ రవి అధికారులకు సూచించారు. బోయాపూర్ గ్రామంలో పైలెట్ సర్వేగా చేపట్టిన డిజిటల్ కార్డుల సర్వే కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలను అర్హులకు అందే విధంగా డిజిటల్ కార్డుల సర్వేను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇంటికి యజమానిగా మహిళ పేరు తర్వాత ఆ కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలన్నారు. ఫ్యామిలీ ఆమోదిస్తేనే ఫొటో, అదికూడా ఒక ఆప్షన్ మాత్రమే అని సూచించారు. అక్టోబర్ మూడో తేదీ నుండి 7వ తేదీ వరకు హెల్త్ ప్రొఫైల్ రికార్డు చేస్తే ప్రక్రియ కొనసాగించాలని,ఏడో తేదీ నాటికి పైలెట్ ప్రాజెక్టు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రికార్డు ప్రక్రియ పూర్తి కానున్నట్లు వివరించారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సేకరించిన వివరాల ఆధారంగా డిజిటల్ కార్డులు జారీ చేస్తారని వివరించారు. అనంతరం ఈనెల 10న పైలెట్ ప్రాజెక్టు నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు వివరించారు. ఆర్థిక హోదాలతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ గుర్తింపు కార్డులను ఇస్తారని వివరించారు. కుటుంబ పెద్దగా ఇంటి మహిళను పేర్కొంటూ కార్డు జారీ చేస్తారన్నారు. కార్డులో కుటుంబ సభ్యులందరికి కామన్‌గా పది అంకెను కేటాయిస్తారని వ్యక్తిగతంగా మరో పది నంబర్ల సంఖ్యను కేటాయించనున్నట్లు వివరించారు. ఇప్పటికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఉన్నతాధికారుల బృందం పర్యటించి ఆయా రాష్ట్రాల్లోని విధానాలపై సర్కారుకు నివేదిక ఇచ్చిందని, వాటన్నింటిని పరిశీలించి తెలంగాణలో అత్యుత్తమ విధానాన్ని రూపొందిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ రవి తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీరాములు, ఎంపిడిఓ కథలప్ప, ఎంపిఓ నరసింహులు, ఆయా శాఖల అధికారులు పంచాయతీ సెక్రెటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పండగకు ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి:ఎస్ఐ

**బిజినపల్లి,అక్టోబరు 03 ప్రభాతవార్త :** దసరా సెలవుల్లో సొంత ఊర్లకు వెళ్లే ప్రజలు విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నాగేశ్వర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాళం వేసి ఇళ్లలో దొంగనాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని ముందస్తు సమాచారంతో తాళాలు వేసి ఉన్న ఇంటి పరిసరాల్లో పోలీసుల నిఘా పెంచుతామన్నారు. అలాగే కాలనీల్లో వీధుల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు గాని, అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100కు లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఊరెళ్తున్న వారు విలువైన వస్తువులను ఇంట్లో పెట్టకుండా బ్యాంక్ లాకర్‌లో లేదంటే వెంట తీసుకెళ్లడం మంచిదని సూచించారు.

## బ్యాలెట్ పత్రాల ముద్రణ కోసం టెండర్ ఆహ్వానం

**నారాయణపేట టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** జిల్లాలోని 280 గ్రామ పంచాయతీలకు గాను 2024 2వ సాధారణ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పత్రాల ముద్రణ కోసం అనుభవం కలిగిన అర్హులైన ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్ యజమానుల నుండి సీల్డ్‌కవర్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. టెండర్ దరఖాస్తు ఫారములు విడి విడిగా ఈనెల 4 నుండి 7 మధ్యాహ్నం 2 గం.ల వరకు పంచాయతీ అధికారి కార్యాలయంలో లభిస్తాయని టెండర్ 7వ తేదీన సాయంత్రం 3 గం.లకు అదనపు కలెక్టర్ సమక్షంలో తెరువడునట్లు తెలిపారు. టెండర్లు దాఖలు చేసిన వారు మాత్రమే హాజరు కావాలని అన్నారు. అదనపు వివరాల కోసం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నందు పని దినాలలో కార్యాలయ వేళల్లో సంప్రదించగలరని తెలిపారు.

## కన్నుల పండువగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రోత్సవాలు

**- గో మాతకు ప్రత్యేక పూజలు.. - గజలక్ష్మి దేవీ అలంకరణలో వాసవీమాత**



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి,అక్టోబర్03 ప్రభాతవార్త:**దేవీ శరన్నవరాత్రోత్స వాలను కల్వకుర్తిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వాసవీమాత అమ్మవారిని గజలక్ష్మి దేవీ అలంకరణలో అలంకరించి ప్రత్యేకంగాపూజలు నిర్వహించారు.దేవాలయ ట్రస్టీ చైర్మన్ జూలూరి రమేష్‌బాబు మాట్లాడుతూ వాసవీమాత అనుగ్రహానికి ప్రతి ఒక్కరు పాత్రులు కావాలని ఆయన పేర్కొన్నారు. అచల లోక పావనిగా వాసవీమాత భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదించునని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, సరస్వతిదేవీకి పరివార దేవతలకు అభిషేకములు, ప్రాత:కాల పూజలు, అఖండ దీపారాధన, దంపతులచేత అమ్మవారికి సామూహిక ప్రత్యేక కుంకుమార్చన కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులచే వేద పారాయణము, బాలభోగము, గోమాతకు మహిళలచే నిర్వహించిన ప్రత్యేక పూజలు ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి పల్లకి సేవ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం గీత ప్రచార సమితి కల్వకుర్తి బృందం ఆధ్వర్యంలో భగవద్గీత, విష్ణు, లలిత సహస్రనామ పారాయణాలు చేపట్టారు. శ్రీ గురు రాఘవేంద్ర నాదస్వర బృందం, వాసవీ దేవాలయం వారిచే వారు చేసిన నాదస్వర విన్యాసాలు ఎంతగానో అలరించాయి. ప్రదోష పూజలు, నైవేద్య సమర్పణ, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణల కార్యక్రమాలను భక్తులకు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని భక్తులు చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంజ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నారాయణరాజు, కోశాధికారి నవీన్, తరుణ్, మిల్లర్లు సభ్యులు, మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం, అవోపా మరియు ఆర్యవైశ్య, యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీక్లబ్ మరియు వాసవి వనితాక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## హోంగార్డు ఖాతా నుండి గుర్తు తెలియని వ్యక్తి డబ్బులు డ్రా కేసు నమెదు..

**జల్లాఘణపురం అక్టోబర్ 03 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన సింగనమని కృష్ణయ్య భూత్పూర్ మండలంలోని పోలీస్ స్టేషన్లో హోంగార్డు గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 1 న ఘణపురం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ పక్కన ఉన్న ఏటీఎంలో 8000 రూపాయలు జమ చేశారు. తన ఏటీఎం కార్డును అక్కడే మర్చిపోవడంతో అదే రోజు 2000 రూపాయలు తన ఖాతా నుండి గుర్తు తెలియని వ్యక్తి డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. ఈ నెల మూడవ తేదీన బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా తన ఖాతా నుండి 14300 డ్రా చేసినట్లు బ్యాంకు అధికారులు చెప్పారు. వెంటనే కృష్ణయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన ఖాతా నుండి గుర్తు తెలియని వ్యక్తి డబ్బులు డ్రా చేశాడని ఫిర్యాదు చేశాడు.ఎస్సై సురేష్ గౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.







జడ్చర్లలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో, లక్ష్మీనగర్ కాలనీ,పద్మావతీకాలనీలో అలంకరణలో అమ్మవారు



అమరచింతలో..

## బాలాత్రిపుర సుందరి అవతరణలో అమ్మవారు

**జడ్చర్ల, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** దేవినవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. జడ్చర్లలోని ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద భక్తులు బారులుదీరి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. జడ్చర్ల పద్మావతి కాలనీలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.



అయిజలో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు..

అయిజలో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బాలా త్రిపుర సుందరి అలంకరణలో..





మక్తల్ పట్టణంలో..

## వర్షానికి తడిసిన ధాన్యం

**- లబోదిబోమంటున్న అన్నదాతలు**



జడ్చర్ల మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్న

**జడ్చర్ల, అక్టోబర్3, ప్రభాతవార్త :** జడ్చర్లలోని మార్కెట్ యార్డులో గురువారం ధాన్యం తడిసింది. మధ్యాహ్నం కురిసన అకాల వర్షానికి మొక్కజొన్న తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టం చేసిన కాపాడిన పంట కండ్ల ముందే నేలపాలైంది. దీంతో అన్నదాతలు లబోదిబోమంటు కన్నీరుమున్నీరయ్యారు. గురువారం మార్కెట్ యార్డుకు 6600క్వింటాళ్ల మొక్కజొన్న ధానర్య వర్షార్పణం కావడంతో వాపోతున్నారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో ధాన్యపు రాశులపై కవర్లు ఉంచినా ఉపయోగం లేకపోయింది. వర్షపునీరు కుప్పలను తాకుతూ వెళ్లడంతో నీటిలో కొట్టుకునోయింది. అకాల వర్షానికి మార్కెట్‌కు తెచ్చిన పంట నష్టపోయామని, తమకు ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## 24వ వార్డులో డిజిటల్ కార్డుల సర్వే ..

**తనిఖీ చేసిన జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి**



సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ, కమిషనర్, కౌన్సిలర్

**జడ్చర్ల,అక్టోబరు 03 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ 24వ వార్డులో డిజిటల్ కార్డుల సర్వే ప్రారంభమైంది. వార్డు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వే తీరును జడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సొంటె రాజయ్యతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. వార్డు ప్రజలు సర్వే బృందాలకు సహకరించి డిజిటల్ కార్డుల కోసం సమాచారం అందించాలని కౌన్సిలర్ సూచించారు. సర్వేలో ఎంపిడిఓ మఛ్చిందర్, తహసిల్దార్ బ్రహ్మంగౌడ్, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొలువుదీరిన దుర్గామాత..



**నారాయణపేట టౌన్,అక్టోబరు 03 ప్రభాతవార్త :** దసరా పండుగ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆయా వార్డుల్లోని మండపాల్లో గురువారం దుర్గామాతను ప్రతిష్టించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తారు. మొదటిరోజు బాలా త్రిపురసుందరీ రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అలంకరణలో అంబాభవాని..

**వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం**



అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

**గద్వాల అక్టోబర్03 ప్రభాతవార్త:**జిల్లాకేంద్రంలోని భవాని నగర్ లో అంబాభవాని మాత ఆలయంలో గురువారం దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సూత్రవే సుదర్శన్ రావు ఇంటి నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మొదటి రోజు అమ్మవారు దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆల యాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్య క్రమంలో భవసార క్షత్రియ సమాజ్ గద్వాల శాఖ అధ్యక్షుడు ఝూడే మధుకర్, కాళిత్ కర్ భవాని ప్రసాద్,ప్రధాన కార్యదర్శి సులాకే సిద్దేశ్వర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.